సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



డ్రాగన్.. సిరులు కురిపించెన్ 8లో



పీజీఆర్ఎస్‌లో వినతులకు తక్షణ పరిష్కారం 8లో



ఉత్కంఠగా మాక్ డ్రిల్ 8లో

న్యూస్‌రీల్

పోర్టులో స్వచ్ఛతా హీ సేవ



మొక్కలు నాటుతున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

విశాఖ సిటీ: స్వచ్ఛతా హీ సేవ–2024 కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం పోర్ట్ అథారిటీ పరిపాలన భవనంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు, డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్‌కుమార్ దూబే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ స్వామి, ఇతర విభాగాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా పోర్టు పరిపాలన భవనం దక్షిణ భాగంలో ఉన్న వ్యర్థాలను తొలగించారు. వెయ్యి మొక్కలు నాటడానికి ప్రణాళికలు రూపొందించగా, సోమవారం 300 మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఏవీఎన్ కాలేజ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అందరితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.

రెవెన్యూ కేడర్లలో బదిలీలు

మహారాణిపేట: రెవెన్యూశాఖలో పలు కేడర్లలో బదిలీలు నిర్వహించారు. మొత్తం 40 మంది డిప్యూటీ తహసీల్దార్ల (డీటీ)ను బదిలీ చేశారు. ఆరుగురు డీటీలను అల్లూరి సీతారామరాజు జిల్లాకు, ఆరుగుర్ని అనకాపల్లి జిల్లాకు కేటాయిస్తూ ఉమ్మడి విశాఖ జిల్లా నోడల్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే విశాఖ జిల్లాలో 28 మంది డీటీలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరితోపాటు 14 మంది జూనియర్ అసిస్టెంటు/టైపిస్టులను, 55 మంది సీనియర్ అసిస్టెంట్లను, 28 మంది వీఆర్‌వోలు గ్రేడ్–2లను కూడా బదిలీ చేశారు.

జెడ్పీలో 154 మందికి..

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్‌లో మొత్తం 154 మందిని బదిలీ చేశారు. వీరిలో 24 మంది ఎంపీడీవోలున్నారు. కార్యాలయ పరిపాలనా అధికారులు(ఏవోలు), సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, నాల్గో తరగతి ఉద్యోగులు ఉన్నారు. కొత్తగా వచ్చిన పది మందికి ఏజెన్సీలో పోస్టింగులు ఇచ్చారు. ఆనందపురం ఎంపీడీవోగా వి.జానకీ, భీమిలికి ఎస్.హనుమంతరావు, పరవాడకు ఎస్.డి.శ్యాం సుందర్, సబ్బవరానికి పి.పద్మజను బదిలీ చేశారు.

నేడు మంత్రి లోకేష్ రాక

మహారాణిపేట: రాష్ట్ర ఐటీ,మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ మంగళవారం విశాఖ వస్తున్నారు. మంగళవారం రాత్రి 9.30 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుంచి రామ్‌నగర్ ఎన్టీఆర్ భవన్‌కు చేరుకొని రాత్రి బస చేస్తారు.

జీవీఎంసీ సెక్రటరీగా వెంకటరమణ

సాక్షి, విశాఖపట్నం : జీవీఎంసీలో పలువుర్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీవీఎంసీ సెక్రటరీగా బి.వెంకటరమణని నియమిస్తూ స్పెషల్ సీఎస్ అనిల్‌కుమార్ సింఘాల్ జీవో జారీ చేశారు. అదేవిధంగా యూసీడీ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పీఎం సత్యవేణిని నియమించారు. జీవీఎంసీ డీపీవోగా కనకమహాలక్ష్మిని నియమించారు. జోనల్ కమిషనర్ నాయుడుని రామచంద్రాపురం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు.

మేయర్, డిప్యూటీ మేయర్లకు ఢిల్లీ సదస్సుకు ఆహ్వానం

అల్లిపురం: నగరాల ఆర్థిక ప్రగతి, ప్రజల జీవన విధానంపై ప్రజా జాతీయ అర్బన్ కన్వెన్షన్–2024 సదస్సుకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌లకు ఆహ్వానం అందింది. నగరాల్లో జీవన నాణ్యతను మెరుగుపరచడానికి, వాటిని మరింత స్థిరంగా మార్చడానికి, నగరాల పాలన, పనిని మెరుగుపరచడం వంటి అంశాలపై ఈనెల 26వ తేదీన ఢిల్లీలో ఈ సదస్సు జరుగుతుందని డిప్యూటీ మేయర్ శ్రీధర్ తెలిపారు.

27న జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 27న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి శ్యామ్‌సుందర్ తెలిపారు. డీమార్ట్, ఫ్లిప్‌కార్ట్, బ్రైడ్ రైట్ ఫైనాన్స్, ఎస్‌బీఐ కార్డ్ స్విగ్గి ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో 250 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అసిస్టెంట్ మేనేజర్, సేల్స్ మేనేజర్, పిక్కర్స్, క్యాషియర్, సీనియర్ మేనేజర్, బీవోబీ క్రెడిట్ కార్డ్స్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ఆఫీసర్, ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎం/బి/డి–ఫార్మసీ ఉత్తీర్ణత సాధించిన 18–30 ఏళ్ల అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాన్ని బట్టి జీతం నెలకు రూ.10,500 వేలు నుంచి రూ.18,000 వేలు వరకు ఉంటుందన్నారు.

● వలంటీర్ల ఆందోళన బాట



ఏపీ ప్రజా వార్డు వలంటీర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వలంటీర్లు ధర్నా చేపట్టారు. ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేలు వేతనంతో వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవడంతోపాటు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వలంటీర్ వ్యవస్థ ప్రభుత్వానికి అనుబంధంగా ఉంటుంది తప్ప, ఏ పార్టీ తరఫున పనిచేయదని, అలా చేస్తే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గెలిచేది కాదని పేర్కొన్నారు. – సీతమ్మధార

● మా చెవులకు కళ్లున్నాయ్.. మా చేతులు చూస్తాయ్.!





మా చెవులకు కళ్లున్నాయి.. మా చేతులు చూస్తాయ్.. తెలుసు మాకు వెలుగేదో.. తెలుసు మాకు చీకటేదో.. అన్న కవి మాటలే స్ఫూర్తిగా ముందుకు కదులుతున్నారీ దివ్యాంగులు. పుట్టుకతోనే అంధులైనా.. పట్టుదల, ఆత్మవిశ్వాసమే నేత్రాలుగా చేసుకుంటూ.. ఒక్కో అడుగు వేసుకుంటూ ముందుకెళ్లారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఒకరికి ఒకరు తోడుగా వెళ్తున్న ఈ అంధుల ఆత్మస్థైర్యం అక్కడ ఉన్న విద్యార్థుల్లో స్ఫూర్తి నింపింది.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సిఫార్సులకే పెద్దపీట

- తహసీల్దార్ల బదిలీల్లో నిబంధనలకు తూట్లు
- ఎమ్మెల్యేలు సూచించిన వారికే కేటాయింపు
- ఏజెన్సీలో పనిచేస్తున్న వారికి మళ్లీ అన్యాయం



మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లాలో తహసీల్దార్ల బదిలీల్లో సిఫార్సులకే పెద్దపీట వేశారు. స్థానిక ఎమ్మెల్యేల ఆదేశానుసారం పోస్టింగ్‌లు లభించాయి. చాలా కాలంగా నగరంలోనే తిష్టవేసిన తహసీల్దార్లను కదిపే సాహసం ఉన్నతాధికారులు చేయలేకపోయారు. దీంతో ఏజెన్సీలో పనిచేసే వారికి నిరాశే ఎదురైంది. రెండేళ్లగా మన్యంలో పనిచేసిన వారిని, 50 ఏళ్లు దాటిన వారిని ఏజెన్సీ నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలన్న జీవోకు అధికారులు తూట్లు పొడిచారు. మైదాన ప్రాంతాల్లో పలు కీలకమైన తహసీల్దార్ పోస్టులు కూడా కూటమి నేతలు చెప్పిన వారికే దక్కాయి. బదిలీల్లో చివరి రోజు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ మొత్తం 16 మంది తహసీల్దార్లకు పోస్టింగులు, కేటాయింపులు చేశారు. ఇందులో ఎనిమిది మందిని విశాఖ జిల్లాకు, ఐదుగుర్ని అనకాపల్లి జిల్లాకు, ముగ్గుర్ని అల్లూరి సీతారామరాజు జిల్లాకు పోస్టింగ్‌లు ఇస్తూ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. తహసీల్దార్లు, ఉప తహసీల్దార్ల పోస్టులన్నీ స్థానిక ఎమ్మెల్యేల సిఫార్సుల మేరకు నిర్వహించారు. కొందరు అధికారులు స్వయంగా ఎమ్మెల్యేలతో ఉన్నతాధికారులు ఫోన్లు కూడా చేయించారు. దీంతో కూటమి ఎమ్మెల్యేల పంపిన జాబితా ప్రకారం తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లకు బదిలీలు నిర్వహించారని విస్తృతంగా ప్రచారం సాగుతోంది.

వీరంటే ఉన్నతాధికారులకూ హడలే..!

గతంలో ఇచ్చిన పోస్టింగ్ జోలికి ఉన్నతాధికారులు వెళ్లలేదు. ఇప్పుడు అన్నీ కొత్త పోస్టింగ్‌లే ఇచ్చారు. గతంలో కేటాయించిన పోస్టింగ్‌లో కొనసాగుతున్న పలువురు తహసీల్దార్లపై తీవ్ర ఆరోపణలు ఉన్నా.. వారిని బదిలీ చేసేటంత సాహసం ఉన్నతాధికారులు చేయలేకపోయారు. వీరిని కొనసాగించేందుకు ఎమ్మెల్యే ఒత్తిడే ప్రధాన కారణంగా తెలుస్తోంది. మొత్తం మీద నాలుగు మండలాల్లో పోస్టింగ్‌లపై విమర్శలు వస్తున్నాయి. కొంత మంది ఉప తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్‌వో పోస్టుల్లోనే నిబంధనలు పట్టించుకోకుండా స్థానిక ప్రజాప్రతినిధులు చెప్పిన వారికే కేటాయించారు.

మళ్లీ వారికి నిరాశే..

అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి విశాఖలో పనిచేయడానికి పలువురు తహసీల్దార్లు ఉత్సాహం చూపారు. అలాగే అనకాపల్లి జిల్లా నుంచి కూడా చాలా మంది దరఖాస్తు చేశారు. మొత్తం మీద ఈ రెండు జిల్లాల నుంచి 15 మంది విశాఖలో పనిచేయడానికి దరఖాస్తు చేసుకున్నారు. నలుగురు తహసీల్దార్లు ఎంతో కాలం నుంచి ఏఎస్ఆర్ జిల్లాలో పనిచేస్తున్నారు. వీరిలో ఇద్దరు ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్నారు. వివిధ అనారోగ్యాలతో బాధపడుతున్నారు. నిబంధనల ప్రకారం ఈసారి కచ్చితంగా మైదాన ప్రాంతంలో పనిచేసే అవకాశం వస్తుందని ఎంతగానో ఎదురుచూశారు. ప్రభుత్వ జీవోను కాదని నేతల సిఫార్సు లేఖలకే ఉన్నతాధికారులు పెద్దపీట వేయడంతో తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు.

నేడు కౌన్సిల్ సమావేశం

- 48 అంశాలతో అజెండా రూపకల్పన
- 27 అంశాలతో అనుబంధ అజెండా



విశాఖ సిటీ: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తొలి జీవీఎంసీ సర్వసభ్య సమావేశం మంగళవారం జరగనుంది. ఇందులో నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్య కార్మికులకు ఆప్కోస్ ద్వారా వేతనం, లైఫ్‌గార్డుల కొనసాగింపు ఇలా 48 అంశాలతో కూడిన ప్రధాన అజెండాను సిద్ధం చేశారు. అలాగే ఇనార్బిట్ మాల్‌కు పైప్‌లైన్ ఏర్పాటు, మెకానికల్ విభాగానికి సంబంధించి మరో 27 అంశాలతో రూపొందించిన అనుబంధ అజెండాపై కూడా చర్చించనున్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ఈ కౌన్సిల్ సమావేశం జరగనుంది. అజెండాలో ప్రధానంగా 2023–2024 ఆర్థిక సంవత్సరంలో జీవీఎంసీ కార్మికులకు ఇవ్వాల్సిన సబ్బులు, కొబ్బరినూనె కొనుగోలు చేయడానికి రూ.1.14 కోట్లు వ్యయం చేయడానికి ప్రతిపాదించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు చేసిన సమ్మెతో అప్పటి ప్రభుత్వం ప్రతి కార్మికునికి రూ.1000 అలవెన్సు ఇవ్వడానికి అంగీకరించింది. వాటిని జీవీఎంసీ సాధారణ నిధులు రూ.54.68 లక్షలు ఇవ్వడానికి ప్రతిపాదించారు. మెకానికల్ విభాగం, ప్రజారోగ్య విభాగం, ఉద్యానవన విభాగంలో ఉన్న 42 మంది సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లను 2024–2025లో కొనసాగించడానికి అనుమతి కోరారు. భూగర్భ మురుగునీటి వ్యవస్థ కార్మికునికి రూ.24వేలు, పారిశుధ్య కార్మికునికి రూ.21వేలు వేతనం ఆప్కోస్ ద్వారా ఇచ్చేందుకు ఈ కౌన్సిల్ ద్వారా నిర్ణయం తీసుకోనున్నారు. మారియట్ హోటల్ నుంచి ఎన్‌జీజీవోస్ కాలనీ వరకు పోర్టు నిధులు రూ.34.76 కోట్లతో రహదారికి ఇరువైపులా కాలువలు, వాటిపై శ్లాబు పనులకు అనుమతి కోరుతూ అజెండాలో పొందుపరిచారు.

రాత్రి బస కేంద్రాలలో పనిచేస్తున్న సిబ్బంది వేతనాలు ఒక్కొక్కరికి రూ.2 వేలు పెంచడానికి, యూసీడీలో పనిచేస్తున్న సీవో, డీసీఎం, ఏడీసీఎం ఆపరేటర్‌ను కొనసాగించే అంశాన్ని చేర్చారు. బీచ్‌లో మునిగిపోయేవారిని రక్షించే లైఫ్ గార్డులను ఒక ఏడాది కొనసాగించేలా ప్రతిపాదన చేశారు. కోస్టల్ బ్యాటరీ నుంచి జాలారిపేట వరకు ఉన్న సౌర విద్యుత్తు దీపాల నిర్వహణ రెండేళ్లు చేపట్టడానికి రూ.1.06 కోట్లతో టెండరు అప్పగించడానికి అజెండాలో చేర్చారు. 21వ వార్డులో జీవీఎంసీ అతిథి గృహం పనులు చేపట్టడానికి రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పెట్టారు.

దేవదాయ శాఖ బదిలీల్లో చిత్రాలు

- ఒక్క రోజు తేడాలోనే శ్రీకనకమహాలక్ష్మి ఈవో బదిలీలో మార్పు

మహారాణిపేట : దేవదాయ, ధర్మాదాయ శాఖలో సిత్రాలు ముక్కుమీద వేలేసుకొనేలా ఉన్నాయి. ఆదివారం పోస్టింగ్ ఇచ్చి బాధ్యతలు స్వీకరించలోపు సోమవారం మరొకర్ని నియమించింది. కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా జిల్లా ఉప కమిషనర్ (డీసీ) ఎస్.సుజాతను ఆదివారం ఆ శాఖ అధికారులు నియమించారు. సోమవారం ఆ ఉత్తర్వులను రద్దు చేసి దేవదాయశాఖ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.శోభారాణిని నియమించారు.

ఏసీ శిరీషకు బదిలీ : విశాఖ జిల్లా సహాయ కమిషనర్(ఏసీ) కె.శిరీషకు బదిలీ అయ్యింది. విజయనగరం జిల్లా ఏసీగా నియమిస్తూ విశాఖలో సంపత్ వినాయగర్ ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అనకాపల్లిలోని నూకాంబిక అమ్మవారి దేవస్థానం ఈవో టి. అన్నపూర్ణను విశాఖ జిల్లా ఏసీగా నియమించారు. అనకాపల్లిలో పనిచేస్తున్న కె. శ్రీధర్‌ను విశాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. చౌల్ట్రీ సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావును అనకాపల్లి నూకాలమ్మ దేవస్థానానికి బదిలీ చేశారు. కరకచెట్టు పోలమాంబ ఆలయ జూనియర్ అసిస్టెంట్ అప్పలరెడ్డిని సంగివలసకు బదిలీ చేశారు.

భూదాన్ భూములు కాపాడండి

మహారాణిపేట: విశాఖ రూరల్ మండలంలోని విలువైన భూదాన్ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పరదేశిపాలెం గ్రామ సర్వే నం.132లో సుమారు 55 ఎకరాలు, సర్వే నం.166/1లో సుమారు 10 ఎకరాలు భూ దాన భూములను కొంతమంది రెవెన్యూ అధికారులు సహకారంతో అన్యాక్రాంతం చెయ్యడానికి దఫాదఫాలుగా చేస్తున్న విశ్వ ప్రయత్నాలను ఎప్పటికప్పుడు జిల్లా అధికారులు దృష్టికి తీసుకొచ్చామన్నారు. ఇప్పుడు మళ్లీ ఆ భూములు కాజేయడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారని పైడిరాజు పేర్కొన్నారు. విలువైన ఆ భూములను కాపాడి ప్రజావసరాలకు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.కె. రెహమాన్, పి.చంద్రశేఖర్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు జె.డి. నాయుడు తదితరులు ఉన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

వాతావరణ మిత్రుడికి స్వర్ణోత్సవం

- మారుతున్న కాలానికి అనుగుణంగా అధునాతన సాంకేతికత
- ప్రభుత్వానికి, ప్రజలకు కచ్చితమైన వాతావరణ సమాచారం

విశాఖ సిటీ: సునామీ.. పెను తుపాన్లు.. వాయుగుండాలు.. ఇలా ఎటువంటి విపత్తులైనా ముందే పసిగడుతుంది. ప్రకృతి విపత్తుల ద్వారా సంభవించే పెను ముప్పును ముందే గ్రహిస్తుంది. వాతావరణ మార్పులపై ఎప్పటికప్పుడు ప్రభుత్వాలను, ప్రజలను అప్రమత్తం చేస్తుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అద్దుకొని దేశ పురోగతిలో తన వంతు సహకారాన్ని అందిస్తూ చారిత్రాత్మకమైన 50వ వసంతంలోకి అడుగుపెడుతోంది విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం. ఈ సందర్భంగా ఏయూలో స్వర్ణోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నారు

1974లో ప్రారంభమై..

తుపాను హెచ్చరికల కేంద్రం(సీడబ్ల్యూసీ) ప్రస్తుతం అన్ని రంగాలకు అత్యంత కీలకంగా మారింది. ముఖ్యంగా వ్యవసాయం, అనుబంధ రంగాలతో పాటు పారిశ్రామిక, వ్యాపార రంగాలకు ఇతోధికంగా సేవలు అందిస్తోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా సేవల విస్తృతి పెరగడంతో సీడబ్ల్యూసీ కొత్త పుంతలు తొక్కుతోంది. తుపాను హెచ్చరికల కేంద్రం విశాఖలో 1974, సెప్టెంబర్ 23న ఏర్పాటైంది. దీనికి ముందు అనేక దశాబ్దాలుగా వాతావరణ పరిశీలన కేంద్రం ఉన్నప్పటికీ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తీరాలకు చెన్నై నుంచి వాతావరణ బులెటిన్‌లను అందించేది. సీడబ్ల్యూసీ పూర్తి స్థాయిలో విశాఖలో ఏర్పాటుకు ముందు 1870లో విశాఖ నగరంలో ఉపరితల వాతావరణం, ఉల్కల పరిశీలన కోసం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం 1940లో మహారాణిపేటలో పీడబ్ల్యూడీ కార్యాలయంలోకి మార్చారు. అక్కడి నుంచి ఉపరితల గాలి డేటాను సేకరించారు. ప్రపంచ యుద్ధంలో సమయంలో ఈ కేంద్రాన్ని విమానాశ్రయానికి మార్చారు. అక్కడ ఈ కేంద్రానికి అమెరికన్ రేడియోసోండే స్టేషన్‌ను జోడించి అమెరికన్లే నిర్వహించేవారు. 1944లో కేంద్రాన్ని సెల్ఫ్ రికార్డింగ్ పరికరాలతో అప్‌గ్రేడ్ చేశారు. అప్పట్లో ఈ స్టేషన్‌కు వాతావరణ శాస్త్రవేత్త డాక్టర్ పి.కోటేశ్వరం నేతృత్వం వహించారు.



తుపాను హెచ్చరికల కేంద్రం

విమానాశ్రయం నుంచి ఏయూకి..

1949–1950లో విమానాశ్రయంలో ఉన్న ఈ కేంద్రాన్ని ఆంధ్రా యూనివర్సిటీ క్యాంపస్‌కు మార్చారు. 1961లో భూకంప శాస్త్ర యూనిట్‌ను ఏర్పాటు చేశారు. కాలానికి అనుగుణంగా అనేక మార్పులు తరువాత రేడియోసొండే యూనిట్ 1971లో ఏయూ సమీపంలోని కిర్లంపూడి లేఅవుట్ ప్రాంతానికి మార్చారు. అదే సమయంలో తుపాన్లు గుర్తించే జీఆర్‌సీ రాడార్‌ను తయారు చేసి దాన్ని దేశంలో తొలిసారిగా డాల్ఫిన్ నోస్ కొండపై లైట్ హౌస్‌కు సమీపంలో ఇన్‌స్టాల్ చేశారు. అనంతరం 1974, సెప్టెంబర్ 23వ తేదీ నుంచి తుపాను హెచ్చరికల కేంద్రం సేవలు విశాఖ నుంచి ప్రారంభమయ్యాయి. 1982లో డాల్ఫిన్ కొండపై ఏర్పాటు చేసిన జీఆర్‌సీ రాడార్ స్థానంలో ఈఈడీ రాడార్‌ను ఏర్పాటు చేశారు. దీంతో అప్పటి నుంచి ఉపరితల పరిశీలన కేంద్రం కూడా సీడబ్ల్యూసీలోకి మారిపోయింది.

సాంకేతికతను మెరుగుపర్చుకుంటూ..

సీడబ్ల్యూసీ ప్రారంభంలో ఎటువంటి అధునాతన సాంకేతిక పరికరాలు అందుబాటులో లేవు. వాతావరణ అంచనాలను గుర్తించేందుకు ఉపగ్రహాలపై ఆధారపడేవారు. ఆ తరువాత 1985లో విపత్తు హెచ్చరిక వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారు. డాల్ఫిన్ కొండపై ఏర్పాటైన రాడార్‌కు బదులుగా కైలాసగిరి కొండపై జర్మనీ రూపొందించిన ఎస్–బ్యాండ్ డాప్లర్ వెదర్ రాడార్‌ను 2006 జూలైలో ఏర్పాటు చేశారు. అనంతరం 2009లో ఆటోమేటిక్ రేడియేషన్ సాధనాలు, కొత్త హైవింగ్ స్పీడ్ రికార్డర్ అందుబాటులోకి వచ్చాయి. ఉపరితల వాయు పరిశీలనకు కొత్త జీపీఎస్ వ్యవస్థను 2009లో తీసుకువచ్చారు. కోస్తా జిల్లాలను ప్రభావితం చేస్తున్న తుపాన్లు, అల్పపీడనం సమయంలో కచ్చితమైన సమాచారాన్ని అందిస్తూ 50వ వసంతంలోకి అడుగుపెట్టింది.

పంతం.. నీదా.. నాదా..

- పెందుర్తిలో అధికార కూటమి ముఖ్యనేతల సిగపట్లు
- పూర్వవైభవం కోసం టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఆరాటం
- నేనూ ఉన్నానంటూ మాడుగుల ఎమ్మెల్యే బండారు పితలాటకం

పెందుర్తి: తిమ్మిని బమ్మిని చేసి అధికారంలోకి వచ్చారు.. ఏది ఎలా జరిగినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బృహత్తర బాధ్యత వారిపై ఉంది. కూటమిగా జతకట్టారు కాబట్టి సమన్వయంతో పని చేసుకుంటూ ప్రజలకు జవాబుదారీతనంలో సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలి. కానీ పెందుర్తి నియోజకవర్గంలో కూటమి ముఖ్యనేతలు ‘పంతం.. నీదా..నాదా’ అంటూ నేలబారు రాజకీయాలకు తెర తీశారు. నియోజకవర్గంపై పట్టు కోసం వెంపర్లాడుతున్నారు. కేడర్‌ను పావులుగా వాడుకుని రోడ్డెక్కి ఒకరిపై ఒకరు విమర్శలు చేయించుకుంటున్నారు. అధికారంలోకి వచ్చి 100 రోజుల వీరి కాపురం ప్రస్తుతం పూర్తిగా బీటలు వారింది. అధికారంలో పెద్దన్న పాత్ర పోషిస్తున్న టీడీపీ నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న గండి బాబ్జీ పూర్వ వైభవం కోసం ఆరాటపడుతుండగా..టీడీపీ తరఫున పెందుర్తి టికెట్ కోసం ఆఖరి నిమిషం వరకు పోరాటం చేసి..చివరకు మాడుగుల వలస వెళ్లిన బండారు సత్యనారాయణమూర్తి.. నేనూ ఇక్కడివాడినే అంటూ ఇక్కడి పాలనలో వేలు పెడుతున్నారు. మొత్తానికి కూటమి నాయకుల కొట్లాట పెందుర్తిలో తారాస్థాయికి చేరుకుంది.

నివురుగప్పిన నిప్పులా..

వాస్తవానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, గండి బాబ్జీ, బండారు సత్యనారాయణమూర్తి పెందుర్తి నియోజకవర్గంలో చిరకాల రాజకీయ ప్రత్యర్థులు. గతంలో వేర్వేరు పార్టీల నుంచి ప్రత్యర్థులుగా పోటీ పడ్డారు. మొన్నటి ఎన్నికల్లో ఓ దశలో గండి బాబ్జీ, పంచకర్ల, బండారు పెందుర్తి సీటు కోసం పోటీ పడ్డారు. పంచకర్లకు టికెట్ కేటాయించిన తరువాత కూడా బండారు తన ప్రయత్నం ఆపలేదు. అప్పట్లో ఆయన అనుచరులు రోడ్డెక్కి పంచకర్లకు టికెట్ ఇవ్వడాన్ని గట్టిగా వ్యతిరేకించారు. బండారును బుజ్జగించి మాడుగుల టికెట్ కేటాయించారు. గండి బాబ్జీని కూడా టీడీపీ పెద్దలు సముదాయించారు. చివరకు ఆయా పార్టీల పెద్దల పొత్తులో భాగంగా వీరంతా కలిసి పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడగా.. పెందుర్తి ఎమ్మెల్యేగా పంచకర్ల గెలుపొందిన సంగతి తెలిసిందే. అధికారం చేపట్టిన నాటి నుంచి వీరి మధ్య స్పర్థలు యథావిధిగా కొనసాగాయి. వాస్తవానికి పంచకర్ల స్థానిక ఎమ్మెల్యే అయినా బండారు, బాబ్జీ అధికారుల బదిలీలు, ఇతర అంశాల్లో వేలు పెడుతూనే ఉన్నారు.



గండి బాబ్జీకి వ్యతిరేకంగా ఉన్న బండారు వర్గీయులు(ఫైల్)

చివరకు రోడ్డెక్కేశారు

తాజాగా కూటమి ముఖ్యనేతలు ముగ్గురు తమ కేడర్ ద్వారా రోడ్డెక్కేశారు. ముఖ్యంగా టీడీపీలో ఆధిపత్య కుంపటి పూర్తిస్థాయిలో రాజుకుంది. ఒకే పార్టీలో ఉన్నప్పటికీ రాజకీయంగా చిరకాల ప్రత్యర్థులైన బండారు, బాబ్జీ వర్గీయులు నేరుగానే ‘ఫైటింగ్’కు సిద్ధమయ్యారు. ఆదివారం చింతగట్లకు చెందిన బండారు సత్యనారాయణమూర్తి వర్గీయులు నేరుగా గండి బాబ్జీని టార్గెట్ చేసి మీడియా ద్వారా తీవ్ర ఆరోపణలు చేశారు. గండి బాబ్జీ వేధింపుల వల్ల తాము ఆత్మహత్యలు చేసుకుంటామని బెదిరించే స్థాయికి కూటమి కుమ్ములాటలు చేరుకున్నాయి.

విశాఖ విజన్ ప్రణాళికను రూపొందించాలి

మహారాణిపేట : స్వర్ణాంధ్ర విజన్ 2047 యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రానున్న ఐదేళ్లలో జిల్లాను అభివృద్ధి చేసే విధంగా ఆయా శాఖలు ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర విజన్– 2047, విశాఖ విజన్ 2029లపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. స్వర్ణాంధ్ర విజన్–2047 లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా ఆర్థికాభివృద్ధికి ప్రణాళికను రూపొందించుకొని, వాటి లక్ష్య సాధనకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. విశాఖ విజన్ 2029 రూపకల్పనలో జిల్లా ఆర్థికాభివృద్ధితో పాటు ఏటా 15 శాతం తలసరి ఆదాయం పెంచేలా శాఖలన్నీ పనిచేయాలని అధికారులను ఆదేశించారు. కొన్ని శాఖల్లో 20 నుంచి 25 శాతం వరకు, మరికొన్ని శాఖల్లో 15 కంటే తక్కువ వృద్ధి ఉన్నప్పటికీ సగటున 15 శాతం వృద్ధి ఉండేలా ముందస్తు ప్రణాళికలు రచించి, గురువారం నాటికి విజన్‌ను సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా విజన్‌తో పాటు మండల విజన్ కూడా రూపొందించాలన్నారు. కార్యక్రమంలో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

స్వర్ణాంధ్ర – 2047 పోస్టర్ ఆవిష్కరణ

స్వర్ణాంధ్ర– 2047 పోస్టరును కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. పలు రకాల వేదికల ద్వారా స్వర్ణాంధ్ర–2047పై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సభలను నిర్వహించనున్నట్లు చెప్పారు. కరపత్రాలు, పోస్టర్లు, క్యూఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్ ద్వారా సమాచారం చేరవేయనున్నట్లు తెలిపారు. పోస్టరులో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి స్వర్ణాంధ్ర–2047పై తమ అభిప్రాయాలు, సలహాలను తెలియజేయాలన్నారు.

శ్రీ చైతన్య కళాశాలపై చర్యలకు డిమాండ్

కళాశాల వద్ద ప్రజా సంఘాల నిరసన



ప్రిన్సిపాల్ నుంచి హామీ పత్రం తీసుకుంటున్న ప్రజా సంఘాలు నాయకులు

మధురవాడ: లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ కనీస సదుపాయాలు కల్పించకుండా విద్యార్థులను తీవ్రంగా వేధిస్తున్న శ్రీ చైతన్య యాజమాన్యంపై ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మారికవలస మెట్రో వద్ద ఉన్న శ్రీ చైతన్య కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కళాశాల హాస్టల్‌ను సందర్శించిన నాయకులు పి.రాజ్‌కుమార్, అజయ్ తదితరులు విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యాజమాన్యం ప్రతి విద్యార్థి వద్ద అదనంగా ఏడాదికి రూ.3 వేలు వసూలు చేస్తుందని, తాగునీరు, మరుగు దొడ్లు వంటి కనీస సదుపాయాలు సక్రమంగా లేవని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏదో ఒక కారణం చెబుతూ పెద్ద ఎత్తును ఫీజులు వసూలు చేస్తున్నారని, తమను ఫ్యాకల్టీ కొడుతున్నారని వాపోయారు. ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు తక్షణమే శ్రీ చైతన్య కళాశాల హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. లేదంటే జిల్లా వ్యాప్తంగా, కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

తప్పులకు సిబ్బంది బాధ్యులా..

ప్రజా సంఘాల నాయకులు యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వారం రోజుల్లో పరిష్కారం చేస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చారు. అయితే యాజమాన్యం తప్పులను వార్డెన్, వైస్ ప్రిన్సిపాళ్లపై మోపుతూ చర్యలు తీసుకుంటామని చెప్పడం విశేషం.

శ్రీ చైతన్య ఘటనపై నివేదిక కోరిన సీఆర్‌పీఎఫ్

మధురవాడ: మారికవలస మెట్రో పక్కన ఉన్న శ్రీ చైతన్య కళాశాల హాస్టల్‌లో కనీస సదుపాయాలు కల్పించడం లేదని విద్యార్థుల ఆర్తనాదాలపై ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ స్పందించింది. ఈ వ్యవహారంపై తక్షణం నివేదిక అందించాలని ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు కమిషన్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. విద్యార్థులకు సెలవు దినాలు వర్తింపజేయకుండా ప్రత్యేక తరగతులు నిర్వహించడం సరికాదన్నారు. కనీస సదుపాయాలు కల్పించకపోవడం దారుణమన్నారు. బాలల హక్కులకు ఎక్కడ ఉల్లంఘన జరిగినా విద్యార్థులు, ప్రజాసంఘాలు aprcpcr2018 @fmail.comకి నేరుగా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.

విద్యార్థి మృతిపై విచారణ

మధురవాడ: కొమ్మాది చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం డిప్లమా చదువుతున్న జ్యోతిప్రకాశ్ (16) ఆత్మహత్య ఘటనపై ప్రభుత్వం నియమించిన కమిటీ సోమవారం కళాశాలలో విచారణ చేపట్టింది. కంచరపాలెం ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కేవీ రమణ సారథ్యంలో పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. చంద్రశేఖర్ తదితరులు జ్యోతి ప్రకాశ్‌తో కలిసి హాస్టల్ ఉంటున్న ఏడుగురు స్నేహితులతో పాటు ఫ్యాకల్టీ, వార్డెన్‌ను విచారించారు. అలాగే ప్రిన్సిపాల్, సిబ్బందిని కూడా విచారించారు. మృతుడు తల్లిదండ్రులు నుంచి వివరాలు సేకరించినట్టు కమిటీ సభ్యులు చెప్పారు.

డ్రాగన్.. సిరులు కురిపించెన్



నమ్మివానిపేటలో ఐదెకరాల్లో సేంద్రియ పద్ధతిలో సాగు ● లాభాలు ఆర్జిస్తున్న నెల్లిమర్ల సోదరులు

తగరపువలస: మెట్ట ప్రాంతంలో సేంద్రియ పద్ధతిలో **డ్రాగన్ తోట సాగు చేసి సిరులు పండిస్తున్నారు భీమిలికి చెందిన నెల్లిమర్ల సూర్యప్రకాష్, చంద్రశేఖర్. గతంలో వీరి తల్లిదండ్రులు జీవీఎంసీ** భీమిలి జోన్ రెండోవార్డు నమ్మివానిపేట ప్రాంతంలో ఎర్రనేలలు కొనుగోలు చేశారు. కోవిడ్ సమయంలో సూర్యప్రకాష్ ఇంటి వద్దే ఉండడంతో తమ భూముల్లో ఎలాంటి పంట సాగు చేస్తే బాగుంటుందో శోధించాడు. డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తే లాభాలు గడించవచ్చని భావించాడు.

మన వాతావరణానికి అనుకూలం

ప్రస్తుతం మనదేశ అవసరాలకు 98 శాతం డ్రాగన్ ఫ్రూట్ వియత్నాం తదితర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. మన వాతావరణంలో కూడా 47 నుంచి 50 డిగ్రీల ఉష్ణోగ్రతలో దీనిని సాగు చేయవచ్చు. నాలుగు నెలలకు ఒకసారి వేప పిండి కలిపిన వర్మీకంపోస్ట్ 5 కిలోల వంతున మొక్కకు అందించాలి. పది రోజులకు ఒకసారి అరగంట పాటు డ్రిప్ ద్వారా నీరు అందిస్తే సరిపోతుంది. చీమలు మొక్కలపై కనిపిస్తే లీటర్ నీటికి 3 ఎంఎల్ వేపనూనె కలిపి మొక్కపై పిచికారి చేస్తుండగా. బ్యాక్టీరియా, ఫంగస్ వంటివి సోకినప్పుడు అగ్ని అస్త్రం వినియోస్తున్నారు. మొక్కలు ఎదుగుదలకు గోకృపామృతం, పంచగవ్యం, చీడల నివారణకు అగ్ని అస్త్రం వినియోగిస్తున్నారు. నాటు పశువుల సాయంతో తయారు చేసిన ఎరువులను పూర్తిగా ఎండబెట్టి వీటిలో జీవన ఎరువులను కలిపి వేయడం వలన వృథా తగ్గి పూర్తిగా మొక్కకు బలం చేకూరుతోంది.



తొక్కలతో లిప్‌స్టిక్

డ్రాగన్ ఫ్రూట్‌తో ఉప వస్తువులైన జామ్, చాక్లెట్, వైన్ వంటివి తయారు చేస్తుండగా వీటి తొక్కలతో ఫేషియల్స్, ఫుడ్ కలర్స్, లిప్‌స్టిక్స్ వంటివి కూడా తయారు చేస్తున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలు పుష్కలం

డ్రాగన్ ఫ్రూట్‌ను ఆహారంగా చేసుకోవడం ద్వారా బ్లడ్ షుగర్ అదుపులో ఉంటుంది. ఇమ్యూనిటీ పవర్‌ను పెంచడానికి, గుండెను పదిలంగా ఉంచడానికి, బరువు తగ్గడానికి, ఎక్కువ శాతం ఫైబర్ ఉండటం వలన జీర్ణశక్తికి, శరీరంలో పేరుకుపోయిన విష పదార్థాలు తొలగించడానికి, ప్రొస్టేట్ క్యాన్సర్ తగించడానికి, మానసిక స్థితిని మెరుగుపరచడానికి, శరీర కాంతిని పెంచడానికి, దంతాలు, ఎముకలు పుష్టిగా ఉంచడానికి దోహదం చేస్తుంది. పుష్కలంగా విటమిన్ సి ఉండటంతో పాటు ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, **విటమిన్ బి,** కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, పాస్పరస్, నియాసిన్, రిబోఫ్లేవిన్ **ఈ ఫ్రూట్** ద్వారా లభిస్తాయి. కాలుష్యంతో నిండిన ప్రస్తుత వాతావరణంలో సేంద్రియ సాగులో ఆరోగ్యం అందిస్తున్న ఈ ఫ్రూట్‌ను పలువురు ఆహారంలో చేరుస్తున్నారు.

ప్రోత్సహించాలి



ప్రస్తుతం ఆంధ్ర, తెలంగాణ, చత్తీస్‌ఘడ్‌లలో డ్రాగన్‌ను పాక్షికంగా సాగు చేస్తున్నారు. ప్రభుత్వాలు సంప్రదాయ పంటలైన వరి, జొన్న తదితర పంటవలె లాభదాయకమైన డ్రాగన్ సాగును ప్రోత్సహించాలి. మార్కెటింగ్ వసతులు కల్పించాలి. నూతన పారిశ్రామికవేత్తలను ఆకర్షించడం ద్వారా వ్యవసాయాధారిత పరిశ్రమలు పెరిగి రైతుకు లాభదాయకంగా ఉంటుంది. కొత్తవారు ఎవరైనా డ్రాగన్ సాగు చేపడితే.. మేము శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తాం. నర్సరీ ద్వారా మొక్కలు కూడా మేమే సరఫరా చేస్తాం. దీనికోసం 74169 99419 నంబరులో సంప్రదించవచ్చు.

–నెల్లిమర్ల సూర్యప్రకాష్, భీమిలి

5 ఎకరాల్లో 8,500 మొక్కలు



2022లో గుజరాత్ నుంచి ఒక్కో మొక్క రూ.65 వంతున కొనుగోలు చేసి 5 ఎకరాల్లో 8,500 మొక్కలు నాటారు. సిమెంట్ పోల్స్, మొక్కలు, డ్రిప్, ఫెన్సింగ్ తదితర ఖర్చుల కింద మొదట్లో ఈ అయిదు ఎకరాలకు రూ.33 లక్షలు ఖర్చు చేశారు. ఈ డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు నాటిన 8వ నెల నుంచి ప్రారంభించి 25 ఏళ్ల పాటు దిగుబడి ఇస్తాయి. మొదటి ఏడాది ఒక్కో మొక్క నుంచి ఒక కిలో, రెండో ఏడాది 5 కిలోలు, మూడో ఏడాది 13 కిలోలు, 4వ ఏడాది 20 కిలోలు, 5వ ఏడాది నుంచి 27 కిలోల వంతున పంట కోతకు వస్తుంది. సాధారణంగా రసాయన ఎరువులతో పండిస్తే ఫ్రూట్ 700 గ్రాముల వరకు వచ్చి మూడు రోజులే నిల్వ ఉండగా.. సేంద్రియంగా సాగుచేయడం వల్ల 250 నుంచి 400 గ్రాముల వరకు వచ్చి 15 రోజుల పాటు నిల్వ ఉంటుంది. పొలం వద్ద ఈ ఫ్రూట్‌ను కిలో రూ.200 చొప్పున విక్రయిస్తుండగా.. టన్నుకు పైబడి ఆర్డర్లు వచ్చినప్పుడు కిలో రూ.130 నుంచి రూ.140 వరకు విక్రయిస్తున్నారు. వీటిని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఏటా ఐదు ఎకరాల పంట సాగుకు జీవన శిలీంద్రియ ఎరువులైన సూడోమోనాస్, ట్రైకోడెర్మా, వేపపిండి, పశువుల గెత్తం, సముద్రపు నాచు నుంచి తీసిన మైక్రో న్యూట్రియల్స్, గోకృపామృతం, పంచగవ్యం, అగ్నిఅస్త్రంతో పాటు లేబర్ చార్జీల కోసం రూ.8 లక్షలు ఖర్చు చేస్తుండగా మొదటి ఏడాది నుంచి లాభాలు ప్రారంభమయ్యాయి. పంట వేసి మూడో ఏడాది కాగా రూ.50 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు నెల్లిమర్ల సోదరులు తెలిపారు.

దేవదాయ శాఖలో పలువురు ఉద్యోగులకు బదిలీలు

సింహాచలం: దేవదాయశాఖ పరిధిలో వివిధ ఆలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం బదిలీ చేసింది. సింహాచలం దేవస్థానంలో డీఈఈగా పనిచేస్తున్న జి.వి.వి.నాగేశ్వరరావును అన్నవరం దేవస్థానానికి, ఏఈగా పనిచేస్తున్న కె.సూర్యారావు కనకమహాలక్ష్మీ దేవస్థానానికి, సూపరింటెండెంట్లుగా పనిచేస్తున్న సిరిపురపు కనకరాజును అరసవిల్లికి, జి.అప్పలనాయుడు విజయనగరం మాన్సాస్ ట్రస్ట్‌కి, వై.అప్పారావు, పి.వి.రమణను అన్నవరం దేవస్థానానికి బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వరాహాలరావు విజయనగరం మాన్సాస్ ట్రస్ట్‌కి, ఎ.శోభనాద్రాచార్యులును అరసవిల్లి దేవస్థానానికి, జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.కృష్ణను విజయనగరం మాన్సాస్ ట్రస్ట్‌కి, జి.ఎస్.ప్రసాద్, వి.సన్యాసిరావు కనకమహాలక్ష్మీ దేవస్థానానికి బదిలీ చేశారు. కనకమహాలక్ష్మీ దేవస్థానంలో ఏఈగా పనిచేస్తున్న కె.సూర్యనారాయణమూర్తి, ఏఈవోగా పనిచేస్తున్న వి.రాంబాబు, సూపరింటిండెంట్‌గా పనిచేస్తున్న జి.వి.వి.ఎస్.కె.ప్రసాద్ సింహాచలం దేవస్థానానికి, అన్నవరం దేవస్థానంలో ఏఈవోగా పనిచేస్తున్న వి.వి.కృష్ణారావు, విజయనగరం మాన్సాస్ ట్రస్ట్‌లో సూపరింటిండెంట్‌గా పనిచేస్తున్న కె.వి.రమణరావును సింహాచలం దేవస్థానానికి బదిలీ చేశారు. కనకమహాలక్ష్మి దేవస్థానంలో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఆర్.గణేష్‌కుమార్, ఎం.వాసు, ఎం.రామజోగారావు, జి.నాగసత్యవాణి సింహాచలం దేవస్థానానికి, అరసవిల్లి దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న శ్యామలరావు, కనకమహాలక్ష్మి దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.నయినారును సింహాచలం దేవస్థానానికి బదిలీ చేశారు.

ఉపాధి కల్పనలో పారిశ్రామికవేత్తల పాత్ర కీలకం



హాజరైన వర్ధమాన పారిశ్రామిక వేత్తలు

తగరపువలస: ఉపాధి కల్పన పెంపొందించడంలో పారిశ్రామికవేత్తల పాత్ర కీలకమని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ సౌరభ్ బాజ్‌పాయ్ అన్నారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ, ఎస్ఐడీబీఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న పీజీ సర్టిఫికెట్ ఇన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ 18 నెలల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. భారత వ్యవస్థాపక సంస్కృతిని ఉపయోగించుకోవడానికి గాను విభిన్న నేపథ్యాల నుంచి 30 మంది వర్ధమాన పారిశ్రామికవేత్తలను ఎంపిక చేసినట్టు తెలిపారు. 10 నెలల అకడమిక్ శిక్షణ 8 నెలల వెంచర్ క్రియేషన్ కోసం మెంటర్‌షిప్ ఉంటుందన్నారు. ప్రోగ్రాం డైరెక్టర్ ప్రొఫెసర్ సుశీల్‌కుమార్ మాట్లాడుతూ ఈ సమగ్ర కార్యక్రమం లక్ష్యం స్కిల్ టు ఎంటర్‌ప్రైజెస్ మోడల్ ద్వారా ఆవిష్కరణ, ఆర్థికవృద్ధి వైపు నడిపిస్తామన్నారు. రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ అమిత్‌శంకర్ , ప్రోగ్రాం కో డైరెక్టర్ ప్రొఫెసర్ జోస్యుల శ్రీనివాస్, డైరెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అదృశ్యంపై కేసు నమోదు



నరసింహమూర్తి (ఫైల్)

పీఎంపాలెం: ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ గేదెల బాల కృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కానిస్టేబుల్ కనకాల వెంకట నరసింహమూర్తి పాత డెయిరీ ఫారం రవీంద్రనగర్ ఆఖరి బస్టాపు ఏరియాలో కుటుంబంతో కలిసి నివసిస్తూ ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. 22వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటల గంటల సమయంలో ఇంటి నుంచి పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. అదే రోజు రాత్రి 7.30 గంటల సమయంలో అతని భార్య కోమలి ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. సోమవారం మధ్యాహ్నం వరకు వేచి చూసిన అనంతరం వాకబు చేయగా..22వ తేదీ రాత్రి 9.15 గంటల సమయంలో స్టేషన్‌నుంచి బయటకు వెళ్లినట్టు పోలీసు స్టేషన్ సిబ్బంది ద్వారా తెలిసింది. దీంతో కోమలి పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

సింహగిరికి విశాఖ డెయిరీ నెయ్యి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో లడ్డు తయారీకి, దీపారాధనకు, ఇతర అవసరాలకు విశాఖ డెయిరీ నెయ్యిని దేవస్థానం అధికారులు కొనుగోలు చేశారు. సోమవారం 1,500 కిలోల కొనుగోలు చేశారు. ఒక్కో టిన్ను 15 కిలోల చొప్పున మొత్తం 100 టిన్నులను తీసుకొచ్చారు. 15 కిలోల టిన్ను 9077 రూపాయలకు కొనుగోలు చేశారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 106 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిపై వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని చెప్పారు.

పీజీఆర్ఎస్‌లో వినతులకు తక్షణ పరిష్కారం

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- అర్జీదారుల నుంచి 424 అర్జీల స్వీకరణ



కలెక్టర్‌కు వినతులను అందజేస్తున్న ప్రజలు

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ప్రజల నుంచి 424 వినతులను కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ కె.మయూర్ అశోక్ ఇతర అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల నుంచి స్వీకరించే వినతులను తక్షణం పరిష్కరించాలన్నారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న అర్జీలను క్లియర్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మోహన్ కుమార్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు.

స్థలాన్ని ఇప్పించండి

విజయనగరం జిల్లా గాజులరేగలో 2013లో 213 గజాల స్థలాన్ని కొనుగోలు చేశానని, ఈ స్థలం ఇప్పుడు ఆక్రమణలకు గురైందని డొంకాడ సాయికిరణ్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్లాట్ నంబర్ 45 శ్రీరామనుజానగర్‌లో దాసరి సుబ్బారావు ఉరఫ్ కృష్ణాజీ నుంచి స్థలం కొనుగోలు చేశానని, 2020 అనధికార లేఅవుట్ కింద విక్రయించి, తర్వాత వీఎంఆర్‌డీఏ నుంచి అప్రూవల్ తీసుకొని స్థలం అప్పగిస్తామన్నారన్నారు. లే అవుట్ చార్జీలు భరిస్తామని చెప్పినప్పటికీ స్పందన లేదన్నారు. స్థలంపై పూర్తి హక్కులు తనకే ఉన్నాయని.. స్థలాన్ని ఇప్పించాలని కోరారు. వీఎంఆర్‌డీఏలో కూడా ఫిర్యాదు చేశామన్నారు.


జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 148 వినతులు



బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

అల్లిపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 148 వినతులు వచ్చాయని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్‌తో కలసి ఆమె నిర్వహించారు. 1వ జోన్‌కు 1, 2వ జోన్‌కు 21, 3వ జోన్‌కు-17, 4వ జోన్‌కు-14, 5వ జోన్ -18, 6వ జోన్‌కు-22, 8వ జోన్‌కు-17, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి 38 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జీవీఎంసీ అడ్మినిస్ట్రేషన్, అకౌంట్స్ విభాగానికి 9, రెవెన్యూ విభాగానికి 10, ప్రజారోగ్య విభాగానికి 10, పట్టణ ప్రణాళిక విభాగానికి 66, ఇంజినీరింగ్ విభాగానికి 3, యుసీడీ విభాగానికి 4 వచ్చాయని పేర్కొన్నారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఫిర్యాదులను తక్షణం సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, ప్రధాన ఇంజినీరు వినయ్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, డీసీ (రెవెన్యూ) శ్రీనివాసరావు, డీడీహెచ్ ఎం.దామోదరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఇ.వాసుదేవరెడ్డి, ఎఫ్.ఎ.ఎ.ఓ మల్లికాంబ, పర్యవేక్షక ఇంజినీరు శాంసన్‌రాజు, రామమోహనరావు, పీవీవీఎస్ ఎస్ రాజు, కృష్ణారావు, గోవిందరావు, యుసీడీ పీవో డి.లక్ష్మి, ఏసీపీ వెంకటరావు, స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు, బయోలజిస్ట్ సాంబమూర్తి, ఆర్ఎఫ్‌వో హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా హఠాన్మరణం



వీవీఎస్ఎం రాజా (ఫైల్)

అగనంపూడి: గాజువాక మున్సిపల్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వి.వి.ఎస్.ఎం.రాజా (57) సోమవారం సాయంత్రం గుండెపోటుతో హఠాన్మరణం పొందారు. యువజన కాంగ్రెస్ నాయకుడిగా, గాజువాక మున్సిపల్ వైస్ చైర్మన్, చైర్మన్‌గా పని చేశారు. గాజువాక చైర్మన్‌గా పనిచేసిన తిప్పల గురుమూర్తిరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికకావడంతో, గాజువాక మున్సిపల్ చైర్మన్‌గా రాజా ఎన్నికై ఏడాదిపాటు పనిచేశారు. తరువాత కొద్ది రోజులకు గాజువాక మున్సిపాలిటీ, జీవీఎంసీలో విలీనం కావడంతో రాజా కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2014 అసెంబ్లీ ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీలో చేరి, అప్పట్నుంచి కొనసాగుతున్నారు. రాజాకు కొన్నాళ్ల క్రితం బైపాస్ సర్జరీ జరిగింది. ఇటీవల ఆరోగ్యం క్షీణించడం, సోమవారం సాయంత్రం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు సమీపంలోని ఏ ప్లస్ హాస్పటల్‌కు తరలించారు. అయితే అప్పటికే రాజా మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని టోల్‌గేటు సమీపంలోని శివాజీనగర్‌లోని స్వగృహానికి తరలించారు. రాజాకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజా మృతి పట్ల పలువురు వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన నాయకులు సంతాపం తెలిపారు.

ప్రభుత్వ కార్యక్రమాలకు టీడీపీ నేతల డుమ్మా..!



మాట్లాడుతున్న గంటా..వేదికపై కానరాని చంద్రంపాలెం నాయకులు

మధురవాడ: తెలుగుదేశం పార్టీలో వర్గవిభేదాలు మరోసారి బయటపడ్డాయి. సోమవారం మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని 'ఇది మంచి ప్రభుత్వం' , స్వచ్ఛత హీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు జీవీఎంసీ 7వ వార్డు పరిధిలో చంద్రంపాలెంకు చెందిన టీడీపీ నాయకులందరూ డుమ్మా కొట్టారు. చంద్రపాలెంలో వినాయకచవితి వేడుకలకు వస్తానని చెప్పి పలుమార్లు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హ్యాండిచ్చారు. దీంతో అలిగిన 7వ వార్డు అధ్యక్షుడు పిల్లా నర్సింగరావు, ముఖ్య నాయకులు బుజ్జి, పిల్లా రాము తదితరులు సోమవారంనాటి కార్యక్రమానికి హాజరుకాలేదు. ఇప్పటికే 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి జనం రాకపోతుండడంతో గంటా అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో సొంత పార్టీ వాళ్లు కూడా డుమ్మా కొట్టడంతో గంటాకు పెద్ద తలనొప్పిగా మారింది.

ఉత్కంఠగా మాక్ డ్రిల్



స్టీల్‌ప్లాంట్ మాక్ డ్రిల్‌లో సీఐఎస్ఎఫ్ ఫైర్ సిబ్బంది

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సోమవారం నిర్వహించిన ప్లాంట్ లెవెల్ మాక్ డ్రిల్ ఉత్కంఠగా సాగింది. ఆన్‌సైట్ ఎమర్జెన్సీ ప్రిపరేషన్‌ను నిర్ధారించడంలో భాగంగా రాష్ట్ర డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (డీసీఎఫ్ఐ) వి.సురేష్, డిప్యూటీ ఎలక్ట్రికల్ స్వప్నలత మార్గదర్శకత్వంలో మాక్ డ్రిల్ నిర్వహించారు.

లిక్విడ్ నైట్రోజన్ లీకైందన్న సమాచారంతో...

యుటిలిటీస్ విభాగానికి చెందిన ఎయిర్ సెపరేషన్ ప్లాంట్-1 వద్ద లిక్విడ్ నైట్రోజన్ ట్యాంక్ నుంచి లిక్విడ్ నైట్రోజన్ లీక్ అయినట్టు సమాచారం వచ్చింది. ఈ సంఘటనలో ఇద్దరు ఉద్యోగులు ఊపిరి ఆడక సతమతమవుతుండగా సహోద్యోగులు కేకలు వేయడంతో అత్యవసర విభాగాలకు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన యుటిలిటీస్ విభాగం ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ ఫైర్ వింగ్ సిబ్బంది మెడికల్ సర్వీసెస్, గ్యాస్ సేఫ్టీ, పర్యావరణ నిర్వహణ విభాగం, భద్రతా విభాగం , హెచ్ఆర్ విభాగం, ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగం ఉద్యోగులు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. బాధిత వ్యక్తులను సంఘటనా స్థలం నుంచి రక్షించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం (సర్వీసెస్) ప్రవీణ్ కుమార్, ఇంధనం, పర్యావరణ నిర్వహణ విభాగం జీఎం ఉత్తమ్ బ్రహ్మ, రాష్ట్ర కాలుష్య నివారణ బోర్డు అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ శ్రీలక్ష్మి తో పాటు ఆయా విభాగాల ఉన్నతాధికారులు, ఉద్యోగుల పాల్గొన్నారు.

అవయవ దానంతో ముగ్గురికి పునర్జన్మ



రేవంత్ (ఫైల్)

కాకినాడ క్రైం: ఆ యువకుడి అవయవ దానంతో ముగ్గురికి పునర్జన్మ లభించింది. పశ్చిమగోదావరి జిల్లా తోకలపూడి గ్రామానికి చెందిన పోలిశెట్టి రేవంత్ శ్రీ మురహరి (19) స్వగ్రామం నుంచి విశాఖపట్నానికి పరీక్ష రాసేందుకు ఈ నెల 21వ తేదీన బయలుదేరాడు. మార్గంమధ్యలో ఎర్రవరం హైవేపై రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కాకినాడ అపోలో ఆసుపత్రికి తరలించగా తగిన వైద్య సేవలు అందించినా తలకు తీవ్ర గాయం కావడంతో ఫలితం లేకపోయింది. బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో వైద్యులు డాక్టర్ ఎంవీ కిరణ్‌కుమార్, డాక్టర్ శివరామగాంధీ కుమారుడి పరిస్థితిని తండ్రి సుబ్రహ్మణ్యంకి వివరించి అవయవ దాన ప్రాధాన్యాన్ని వివరించారు. దీంతో సుబ్రహ్మణ్యం జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లో తన కుమారుడి అవయవదానానికి రిజిస్టర్ చేశారు. దీంతో రేవంత్ కిడ్నీని కాకినాడ అపోలో ఆసుపత్రికి, మరో కిడ్నీని విశాఖపట్నం కేర్ ఆసుపత్రికి, కాలేయాన్ని షీలానగర్ అపోలో ఆసుపత్రికి తరలించి ముగ్గురి ప్రాణాలు కాపాడారు. ఇందుకు కాకినాడ అపోలోలో ఆర్గాన్ హార్వెస్టింగ్ నిర్వహించారు. జిల్లా పోలీస్ శాఖ సాయంతో సోమవారం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి అవయవాలను సురక్షితంగా సకాలంలో తరలించారు.

29 నుంచి పారా స్విమ్మింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి పారా స్విమ్మింగ్ పోటీలు ఈనెల 29 నుంచి రైల్వే అక్వా స్విమ్మింగ్ పూల్‌లో జరగనున్నాయి. ఈ సందర్భంగా పోటీల పోస్టర్‌ను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ విడుదల చేశారు. కలెక్టర్ చాంబర్‌లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పలు జిల్లాలకు చెందిన పారా స్విమ్మర్లు ఈ పోటీల్లో పాల్గొనున్నారన్నారు. క్రీడాప్రాధికార సంస్థ పర్యవేక్షణలో పారా స్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో పోటీలు జరగనున్నాయి.